రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అభ్యర్థులు

చార్మినార్: ఈనెల 18న జరగనున్న తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. శుక్రవారం కీర్తి రాజ్ గోపాల్‌కు చెందిన ప్యానల్ సభ్యులు అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ప్యానల్‌కు చెందిన 34 మంది సభ్యులు ఉదయం చాదర్‌ఘాట్ దర్బార్ మైసమ్మ ఆలయంలో పూజలు చేసి అక్కడి నుంచి మేరు సంఘం నాయకులతో కలిసి ర్యాలీగా దారుషిఫాలోని మేరు సంఘం భవనానికి చేరుకొని అక్కడ రాష్ట్ర ఎన్నికల అధికారి పి.సురేష్ కుమార్‌కు నామినేషన్ల పత్రాలు అందజేశారు. రాష్ట్ర మేరు సంఘం అధ్యక్షుడిగా కీర్తి రాజ్ గోపాల్, ప్రధాన కార్యదర్శిగా దీకొండ నర్సింగ్ రావు, కోశాధికారిగా తాళ్ల వేంకటేశ్వరరావు తదితర ప్యానల్‌కు చెందిన సభ్యులు నామినేషన్ పత్రాలు అందజేసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మాజీ అధ్యక్షుడు కొవ్వూరు భాస్కర రావు, కీర్తీ ప్రభాకర్, సంఘం నాయకులు ఎస్.బి.సంగే వార్, దీకొండ శ్రీనివాస్, కె.వెంకటేష్, ఓదెల సత్యనారాయణ, కొండూరు చంద్ర శేఖర్, కె.సురేష్ బాబు, రాపర్తి రవి కుమార్, ఓదెల శేఖర్, కె.సంజీవ్‌తో పాటు రాష్ట్రంలోని మేరు సంఘం జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ తెలిపారు. జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశానుసారం ఇందిరానగర్‌లో శుక్రవారం దోమ కాటు వ్యాధుల నివారణపై మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..డెంగీ వ్యాధి ప్రబలకుండా ఇళ్లల్లోని నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. వారానికి ఒకరోజు డ్రై డేగా పాటించాలన్నారు. జీహెచ్‌ఎంసీ చాంద్రాయణగుట్ట సర్కిల్ యూసీడీ కమ్యూనిటీ ఆర్గనైజర్ రాములు, మలేరియా సూపర్‌వైజర్ లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో సాంకేతిక మార్పులు ఖాయం



వివరాలను వెల్లడిస్తున్న తృప్తి గాంధీ తదితరులు

గచ్చిబౌలి: బిల్డింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో డిజిటల్ ప్రాజెక్టు డెలివరీ సొల్యూషన్స్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు ఆటో డెస్క్ కంపెనీతో కలిసి పనిచేస్తున్నట్లు సిస్ టెక్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు తరుణ్ బిష్తి తెలిపారు. శుక్రవారం సెంట్రల్ కోర్టులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సాంకేతికంగా భవన నిర్మాణంలో నిర్మాణాత్మక మార్పులను తీసుకురానున్నట్లు తెలిపారు. తమ సంస్థల కలయికతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ విధానంలో పలు మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆటో డెస్క్ టెక్నికల్ మేనేజర్ తృప్తి గాంధీ, సీఎస్ఏ టి.మేఘన, రీజినల్ సేల్స్ మేనేజర్ రాఘవ, కృష్ణ సుమన్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మధుకర్ అన్నారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాధిక ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ నారాయణగూడ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మధుకర్ ప్రారంభించి మాట్లాడుతూ..ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో, కేన్సర్, తలసేమియా రోగులకు తరచూ రక్తం అవసరం ఉంటుందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో కాలేజ్ ఆఫ్ ఫైనార్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కమల్‌రాయ్, ప్రొఫెసర్ సీతారామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మను, చిన్న సైదులు, ఎ.సత్యానారాయణ, సతీష్, ఆదిత్యమూర్తితో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గోల్కొండ ఆషూర్‌ఖానాలో షియా 'మజాలిస్'



గోల్కొండ: గోల్కొండ-రాందేవ్‌గూడ రోడ్డులోని అబ్బాస్ ఆషూర్‌ఖానాలో షియా ముస్లింలు సబీల్(సంతాప దినం) నిర్వహించారు. శుక్రవారం ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, మాసాబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల నుంచి షియా ముస్లింలు పెద్ద సంఖ్యలో ఆషూర్‌ఖానాకు చేరుకున్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు అందరూ నల్లటి వస్త్రాలు ధరించి మజాలిస్ కార్యక్రమానికి హాజరయ్యారు. కర్బాల మైదానంలో హజ్రత్ అబ్బాస్ నాస్తికులతో పోరాడి వీర మరణం పొందినందున ఆయనను స్మరిస్తూ సంతాప గీతాలు ఆలపించారు. అనంతరం ఆలంలకు ధట్టి కట్టి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబీల్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గోల్కొండ కోట చౌరస్తా నుంచి ఆషూర్‌ఖానా వరకు ప్రత్యేక నల్లటి టెంటు వేసి తాగునీరు, షర్బత్‌ను పంపిణీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరికీ ప్రభుత్వ పథకాల అందేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఉదయం కార్వాన్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి పలువురు టోలిచౌకీలోని మెరాజ్ కాలనీలో ఆయనను కలిశారు. తనకు పింఛన్ ఇంకా మంజూరు కాలేదని ఓ వృద్ధుడు ఆయనతో మొరపెట్టుకున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు తనకు ఇంకా మంజూరు కాలేదని మరో మహిళ ఎమ్మెల్యేకు వివరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తన కార్యాలయ సిబ్బందిచే విచారణ జరిపించి వాటిని మంజూరు చేయించేందుకు ఈపాటికే చర్యలు తీసుకున్నామన్నారు.




శాకంబరిగా మరిగెమ్మ అమ్మవారు



డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడి ప్రాంతంలోని మరిగెమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. దండోల్ల సుభాష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాకంబరి అలంకరణలోని అమ్మవారిని దర్శించుకోవడానికి స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల నాగేశ్వర్ రావు, కిషన్, అశోక్, నాగరాజ్, శ్రీనివాస్, వేణుగోపాల్, శివ, బబ్లూ పాల్గొన్నారు.

'హలో బీసీ చలో ఢిల్లీ' జయప్రదం చేస్తాం



మాట్లాడుతున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: ఈ నెల 5, 6, 7 తేదీల్లో పార్లమెంటు ముట్టడి, జంతర్ మంతర్ మహా ధర్నాను విజయవంతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. హలో బీసీ చలో ఢిల్లీ పేరుతో వేలాది మంది పాల్గొని కులగణన కోసం చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్ సాధన కోసం ఆందోళనలు చేపడుతామన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున బడుగు బలహీన వర్గాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, పీసీసీ రాష్ట్ర నాయకులు పాశం రాజేందర్ యాదవ్, నర్సింగ్‌రావు, శివకుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుపై సంబరాలు



సంబరాల్లో రవిమాదిగ, ములుగు శివమాదిగ, సీమ శంకర్‌మాదిగ తదితరులు

జియాగూడ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ దాఖలు చేసిన పిటీషన్‌పై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి జియాగూడ ఇమాంపురాలోని నవభారత్ సంఘం వద్ద బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం కార్పొరేటర్ దర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకులను ఆయన ఘనంగా సన్మానించారు. నవభారత్ సంఘం ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై.జశ్వంత్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, డి.సంతోష్ కుమార్, ఆర్.బాలకిషన్, డి.లక్ష్మీనారాయణ, ఎం.దర్శన్, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు పాల్గొన్నారు.

సీతారామ్‌బాగ్‌లో పాలాభిషేకం..

నాంపల్లి: ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై స్థానిక బీఆర్ఎస్ నేత ఎస్.పూజారీలాల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సీతారామ్‌బాగ్‌లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పూజారీలాల్ మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణకు మాదిగలు చేసిన పోరాటం ఫలించిందని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

సుల్తాన్‌బజార్: మాదిగ దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితం, మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగా సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడాన్ని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.యాదగిరి అన్నారు. అబిడ్స్‌లోని మాదిగ అమరవీరుల విగ్రహాలకు ఆయన పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సీమ శంకర్, శివ మాదగ, రవి మాదిగ, శ్రీను మాదిగ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదంపై హర్షం..

యాకుత్‌పురా: ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీజేపీ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్ హర్షం వ్యక్తం చేశారు. సుల్తాన్‌షాహిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ ఉప కులలను వర్గీకరించాలని కోరుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాకుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా చారిత్రత్మకమైన తీర్పును ఇవ్వడం స్వాగతనీయమన్నారు.

అబిడ్స్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

అబిడ్స్: ఎస్సీ ఉపకులాల ఏబీసీడీ వర్గీకరణకై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. అబిడ్స్ వద్ద దివంగత పొన్నాల సురేందర్ మాదిగ స్థూపం దగ్గర సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ గ్రేటర్ హైదరాబాద్, గోషామహల్ నియోజకవర్గం నాయకులు సీమ శంకర్ మాదిగ, పూజలోల్ల రవి మాదిగ, ములుగు శివ మాదిగ మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరనకు పలువురు నాయకులు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్ గౌడ్, చందు మాదిగ, నరేష్‌కుమార్ మాదిగ, విజయ్‌కుమార్ మాదిగ, ప్రవీణ్ మాదిగ, దీపక్ మాదిగ పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ నాయకులను సన్మానిస్తున్న ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ



మాదిగ అమరవీరుడి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న యాదగిరి తదితరులు



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పూజారీలాల్

తల్లిపై దాడి చేసిన కుమారుడికి జైలు

సంతోష్‌నగర్: తల్లిపై దాడి చేయడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించిన కేసులో ఓ వ్యక్తికి శుక్రవారం నాంపల్లిలోని 7వ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ నిందితుడికి ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ అపోలో ఆసుపత్రి పోచమ్మ గడ్డ ప్రాంతానికి చెందిన ప్రమీలపై తన చిన్న కుమారుడు జాకబ్ (31) దాడి చేయడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో తల్లి ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జాకబ్‌పై పోలీసులు ఈ-పెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని 7వ మెట్రోపాలిటన్ కోర్టులో శుక్రవారం హాజరు పరిచారు. పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ నిందితునికి ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తికి జైలు, జరిమానా

గౌలిపురా: భార్యపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బార్కాస్ బిస్మిల్లా కాలనీ ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ (32) ఇటీవల తనపై తీవ్రంగా కొట్టి దాడి చేశాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు భవానీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కబ్జాను అడ్డుకోవడంతో దాడి చేశారంటూ మహిళ ఫిర్యాదు

గౌలిపురా: ఆలయ భూమి కబ్జా చేయడమే కాకుండా తన కుమారుడిపై దాడికి పాల్పడ్డారని ఓ మహిళ మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ వివరాల ప్రకారం.. బేలా హరిబౌలి, లక్ష్మీనారాయణ ఆలయ నిర్వాహకులు చంద్రకళ కుటుంబ సభ్యులు ఐదు తరాల నుంచి నివాసముంటున్నారు. ఆలయం వెనుక భాగంలో నవీన్ యాదవ్ (45), కిషన్‌యాదవ్ (43) కుటుంబ సభ్యులు నివాసముంటున్నారు. వీరు ఆలయ ప్రాంగణంలో స్థలాన్ని ఆక్రమించి దుకాణాన్ని ఏర్పాటు చేసి ఆ స్థలం వారిదంటూ చెప్పుకుంటున్నారు. ఇదేమిటని చంద్రకళ ప్రశ్నించగా ఈ స్థలం మాదంటూ రాకపోకలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అంతేకాక చంద్రకళ కుమారుడు పండిట్ నారాయణ ప్రసాద్‌ను తోసేయడంతో గాయాలకు గురయ్యాడు. చంద్రకళ తమకు ప్రాణహాని ఉందంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



బోనాల వేడుకల్లో టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని అన్నారు. టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలోని అమ్మవారి ఆలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ నాయకులు మామిడి ప్రభాకర్, క్రాంతి, చక్రి, సత్యనారాయణ కస్తూరి వెంకటేశ్వర్లు, ఆరీఫ్, చందు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



స్విమ్మింగ్ క్రీడాకారులతో వెంకటేశ్వర్‌రావు తదితరులు

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ క్రీడాకారుల బృందం 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ జాతీయ అక్వాంటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు బయల్దేరి వెళ్లారు ఈ మేరకు శుక్రవారం ఎల్బీస్టేడియంలో ఆ క్రీడాకారులకు కిట్లను అందజేశారు. అనంతరం గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ ఎం.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఏ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

17న ఐకాన్ అవార్డ్స్ ప్రదానం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గచ్చిబౌలి: ది రీల్స్ సినిమా వారపత్రిక 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆగస్టు 17న రవీంద్రభారతిలో తెలంగాణ ఐకాన్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ కిషన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఐకాన్ అవార్డుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ..వివిధ రంగాల్లో నిష్ణాతులైన తెలంగాణ ప్రముఖులకు ఈ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు 7396817623లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై అవగాహన



ఫ్రెండ్స్ కాలనీ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ వెంకటేష్‌గౌడ్

బహదూర్‌పురా: టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో విద్యుత్ బిల్లులు చెల్లింపు విధానంపై అత్తాపూర్ ఏడీఈ వెంకటేష్ గౌడ్ ఫ్రెండ్స్ కాలనీ వినియోగదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఫ్రెండ్స్ కాలనీలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ నేరుగా వినియోగదారులతో మాట్లాడారు. కొత్తగా రూపొందించిన యాప్‌లో బిల్లులో చెల్లింపు ఎంతో సులభతరం అని, దానిపై అవగాహన కల్పిస్తూ వినియోగదారులను ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే విధంగా ప్రోత్సహించారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

విజయనగర్‌కాలనీ: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హుమాయున్‌నగర్ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయ్‌నగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజానాట్య మండలి హైదరాబాద్ నగర కమిటీ వారు ఏర్పాటు చేసిన డ్రగ్స్‌పై ఫొటో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయి చేరుకోవడమే లక్ష్యంగా ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ప్రజానాట్య మండలి నగర ప్రధాన కార్యదర్శి ఎస్.మారన్న, నగర ఉపాధ్యక్షుడు రఘు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చార్మినార్‌లోని పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీ ఎస్పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ అక్బర్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. పెట్ల బురుజు, దూద్‌బౌలి తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పెట్ల బురుజు, పురానాపూల్, మెడ్స్ హాస్పిటల్, పీటీఓ, దూద్‌బౌలి, రమా టాకీస్, బహదూర్‌పురా, కామాటిపుర, ఎస్బీహెచ్ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే హుస్సేనీ ఆలం విద్యుత్ ఫీడర్ పరిధి లోని హుస్సేనీ ఆలం, మూసాబౌలి, సిప్లిగంజ్, జామియా నిజామియా కాలేజ్, పెట్లాబుర్జు, కోకాకి తట్టి, మూసా ఖాద్రి దర్గా తదితర ప్రాంతాల్లో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. కులీ కుతుబ్ షా స్టేడియం విద్యుత్ పీటర్ పరిధిలోని కుడా స్టేడియం, సిటీ కాలేజ్, మెహందీ, చేలాపుర, మూసాబౌలి, హుస్సేనీ ఆలం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పురా: బోనాల సందర్భంగా హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. 5వారాల పాటు నిర్వహించే కుంకుమార్చనలో 4వ వారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 9న చివరి వారం సందర్భంగా 4వారాల పాటు కుంకుమార్చనలో పాల్గొన్న వారికి అమ్మవారి చీరాలను అందజేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు జగన్మోహన్, రాజారత్నం, దత్తాత్రేయ, సతీష్, ఎస్.పీ క్రాంతి కుమార్ తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



మహంకాళి వద్దకు బోనంతో వెళ్తున్న మహిళలు

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న జగదాంబిక మహంకాళి అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలిస్తున్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు అమ్మవార్లకు తొట్టెల, బోనం సమర్పిస్తున్నారు. శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో మహంకాళి అమ్మవారికి పూజారి బి.సురేష్‌వారి పూజలు చేశారు.

నాంపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా గిరిధర్



నాంపల్లి: నాంపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అనస్తీషియా విభాగానికి చెందిన డాక్టర్ గిరిధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ సునీత కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ..ఆసుపత్రి గురించి తనకు పూర్తి అనుభవం ఉందన్నారు. ఇదే ఆసుపత్రిలో తాను అనస్తీషియా విభాగంలో వైద్యుడిగా పనిచేసినట్లు వివరించారు. ఆసుపత్రిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శాయాశక్తుల కృషి చేస్తామని పేర్కొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా శ్రీనివాసరావు



గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా ఉన్న మహజరుల్లా బదిలీ కావడంతో పి.వి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆసుపత్రి ఏటగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ డాక్టర్ అయిన పి.వి.శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కౌసర్ మోహియుద్దీన్ సలహాలు, సూచనలతో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రశాంతంగా ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం నిర్వహించిన సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో ముస్లింలతో పాటు మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాల పాల్గొన్నారు. ప్రార్థనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

రేపు తెలంగాణ అయ్యప్ప జేఏసీ ఆత్మీయ సమావేశం

గౌలిపురా: అయ్యప్ప స్వాములు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై ఈ నెల 4న గౌలిపురాలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో తెలంగాణ అయ్యప్ప జేఏసీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ మణికంఠ మహా పాదయాత్ర ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అయ్యప్ప స్వాములందరూ హాజరు కావాల న్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

నాలాకు మరమ్మతులు చేపట్టండి



ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్‌లో కుంగిపోయిన నాలా మరమ్మతులు చేపట్టాలని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గత సంవత్సరం కుంగిపోయిన నాలా సమీపంలోనే రోడ్డు, నాలా కుంగిపోవడం ధారుణమన్నారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్ వెంటనే గోషామహల్ ప్రాంతాన్ని పర్యటించి మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా గోదాములు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వెంటనే భారీ వాహనాల రాకపోకలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.